క్లుప్తంగా

సరస్వతి స్కూల్లో వసంత పంచమి వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామనగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు చిన్నారులకు తల్లిదండ్రులు పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానసవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సన్మానం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యశశ్వి రమణను సోమవారం సూపరింటెండెంట్ స్వగ్రామమైన గణపవరానికి చెందిన కల్లంపల్లి అచ్చయ మిత్రమండలి సన్మానించింది. ఈసందర్భంగా మిత్రమండలి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ యశశ్వి రమణ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులై గణపవరం గ్రామానికి వన్నె తెచ్చారని కొనియాడారు. ఎంతో మందికి కంటి ఆపరేషన్లు చేయించి పేదలకు కంటి చూపు భాగ్యాన్ని కల్పించడంలో డాక్టర్ యశశ్వి రమణ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, గణపవరం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వంద డస్ట్‌బిన్‌లు వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకుని గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన 1960 బ్యాచ్ జీవైఎంసీఏఎస్‌ఏ సభ్యులు వంద డస్ట్‌బిన్‌లను సోమవారం విరాళంగా అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణకు జీవైఎంసీఏఎస్‌ఏ సభ్యులు డాక్టర్ బాలభాస్కర్, డాక్టర్ హనుమంతరావు అందజేశారు.

జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు వీల్స్ చైర్స్ వితరణ



గుంటూరు మెడికల్: బెవిలిన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రోగుల సౌకర్యార్థం గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు వీల్ చైర్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ బెవిలిన్ ఫార్మా కంపెనీ చేసిన వితరణ అభినందనీయమన్నారు. కంపెనీ రీజినల్ మేనేజర్ టి.రాఘవేంద్ర రావు, ఏరియా మేనేజర్ ఎ.శ్రీనివాస రెడ్డిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటసుందరాచారీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు. అరుణ కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ బిందు మాధవి, డాక్టర్ భారవీదేవిలు పాల్గొన్నారు. రాఘవేంద్ర రావు మాట్లాడుతూ రోగులకు సౌకర్యాలను మెరుగుపరిచే క్రమంలో దాతలు ముందుకు రావాలని కోరారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి



తెనాలిఅర్బన్: సచివాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు మర్యాదగా వ్యవహరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 13,19 వార్డులలో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. మురుగు కాల్వలను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే బోసురోడ్డులో కాల్వలపై ఏర్పాటు చేసిన అక్రమణలను తొలగించాలని టీపీవో సాంబశివరావును ఆదేశించారు. అలాగే పలు సచివాలయాలను పరిశీలించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

6 నుంచి పునరుత్థాన పండుగలు

తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 తేదీల్లో పునరుత్థాన పండుగలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద రోజూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కూడికలు జరుగుతాయని చెప్పారు. బ్రదర్ సాల్మన్ వాక్య పరిచర్య చేస్తారని వివరించారు.



కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన కార్పొరేటర్లతో మేయర్ కావటి మనోహరనాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు



స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నిక కోసం వచ్చిన వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

క్షణక్షణం ఉత్కంఠ

స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నిక ఉత్కంఠగా సాగింది. కూటమి నేతలు అడుగడుగునా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను అడ్డుకున్నారు. భారీ ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలను సమీకరించారు. కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ మొహరించారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల కౌన్సిల్‌కు హాజరయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు



గుంటూరు నగరపాలక సంస్థ ఎదుట హడావుడి చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

7న లక్ష డప్పులు.. వేల గొంతులు సాంస్కృతిక ప్రదర్శన



నెహ్రూనగర్: మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు భారీ సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ పొలిట్ బ్యూరో సభ్యులు చలివేంద్రం వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం సంజీవయ్యనగర్‌లో ప్రదర్శన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ చేస్తున్న ఈ ప్రదర్శనలో మాదిగలంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దావులూరి కుమార్, జీబీ రాబు, పూనూరి వెంకటేష్, పెద్ద వీరయ్య, ప్రేమానందం, బాబు, గండికోటి, మంద సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులు గెలుపు

వివరాలు వెల్లడించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



కార్పొరేటర్ మీరావలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. బరిలో నిలబడిన ఆరుగురు కూటమి అభ్యర్థులు గెలుపొందారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఎన్నికల అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు కమిషనర్ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు జనవరి 16న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఎన్నికల అధికారిగా జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసును నియమించినట్లు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 56 మంది కార్పొరేటర్లు ఓటు హక్కుని వినియోగించుకున్నారని ఆయన వివరించారు. మూడు గంటల తర్వాత ఓట్ల లెక్కింపుని అభ్యర్థుల సమక్షంలో చేపట్టామని పేర్కొన్నారు. ఫలితాల్లో వరుసగా 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్(33), 16వ డివిజన్ కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ (32), 10వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మీరావలి (32), 46వ డివిజన్ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ (31), 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు (31), 51వ డివిజన్ కార్పొరేటర్ ముప్పవరపు భారతి (30) ఓట్లు సాధించి, స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని కమిషనర్ ప్రకటించారు. పోటీల్లో ఉన్న 2వ డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి (24), 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్ (24), 34వ డివిజన్ కార్పొరేటర్ రాజలత బూసి (24), 53వ డివిజన్ కార్పొరేటర్ ధూపాటి వంశీబాబు (23), 5వ డివిజన్ కార్పొరేటర్ యాట్ల రవికుమార్ (23), 24వ డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి ఒక్క ఓటు సాధించారని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా ఎన్నిక నిర్వహించిన ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో చలమయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రాఘవరావు, రామకృష్ణప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య– కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీకాం కంప్యూటర్స్‌లో 98 శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో 90 శాతం, బీసీఏలో 95 శాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపులుసు రాఘవరావు, కర్పూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గత 25 ఏళ్ల నుంచి ఉత్తమమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాలలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని వివిధ రంగాల్లో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ, అధ్యాపకులు భవానీదుర్గ, చంద్రశేఖర్, రాజరాజేశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, మధుసూదన్ పాల్గొన్నారు.

‘ఫీజు పోరు’ విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ‘ఫీజు పోరు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.వినోద్ ఆధ్వర్యంలో మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి రూ.3,900 కోట్లు బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్న విషయాన్ని చరిత్ర చూసి తెలుసుకోవాలని చెప్పారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి విద్యా వ్యవస్థలో వెలుగులు తీసుకొచ్చారని తెలిపారు. కూటమి పాలనలో విద్యారంగంలో నీరుగారిపోయిందని విమర్శించారు. ఇదే వైఖరిని అవలంబిస్తే విద్యార్థుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు బాజి, రవి, నాగరాజు, అజయ్ పాల్గొన్నారు.

‘ప్రేమ శిఖరం‘ పద్య కావ్యం ఆవిష్కరణ



ప్రేమ శిఖరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: వ్యక్తి ప్రేమ కంటే విశ్వజనీన ప్రేమ అజరామరంగా విరాజిల్లుతుందని సాహితీ భారతి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సోమవారం ‘ప్రేమ శిఖరం’ పద్య కావ్యం ఆవిష్కరణ సభ నిర్వహించారు. లఘు చిత్ర దర్శకుడు గన్నే వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ఢమరుకం లలిత కళా సమితి ఆధ్వర్యంలో సాహిత్య బ్రహ్మ డాక్టర్ వీవీఎల్ నరసింహారావు ఆనంద భిక్షువు పద్య కావ్యం ప్రముఖ రచయిత చిటిప్రోలు వెంకటరత్నం నాటకీకరించారు. డాక్టర్ భవానీదేవి గ్రంథావిష్కరణ చేయగా, వెంకటరత్నం, జయప్రద దంపతులకు తొలి ప్రతిని అందించారు. డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి సమీక్ష నిర్వహించారు. గన్ని శాన్వితకు నాట్య మంజీర బిరుదు, చిత్రకళలో నైపుణ్యాలను ప్రదర్శించిన 20 మంది చిన్నారులకు యువ చిత్రరత్న పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, డాక్టర్ మైలవరపు లలితకుమారి, వి.ఎస్.విద్యాసాగర్, చేగొండి సత్యనారాయణమూర్తి, ఢమరుకం లలిత కళా సమితి వ్యవస్థాపకులు వి.మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..

- నగరంపాలెంలో ఈద్గా స్థలం కబ్జా
- తూర్పు ఎమ్మెల్యే అండతోనే షెడ్ నిర్మాణం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ముస్లిం సంఘాలు
- చోద్యం చూస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు



నగరంపాలెంలోని ఈద్గా స్థలంలో అక్రమంగా నిర్మాణం చేస్తున్న మరో షెడ్

లక్ష్మీపురం: అధికార పార్టీ అండతో కొందరు రెచ్చిపోతున్నారు. కబ్జాలకు పాల్పడుతున్నారు. నగరంలోని అంజుమన్ ఆస్తులు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. వివరాలు.. గుంటూరు నగరంలోని నగరంపాలెం వద్ద ఈద్గా స్థలం ఉంది. గతంతో పది కుటుంబాలు చిరు వ్యాపారం చేసుకుంటూ నెల వారి అద్దె చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈద్గా స్థలంపై తూర్పు ఎమ్మెల్యే కన్నుపడింది. చిరు వ్యాపారులను అక్కడ నుంచి ఖాళీ చేయించారు. అదే ప్రదేశంలో ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి పక్కనే ఓ టీ బంక్ ఉండేది. దానిని ఖాళీ చేయించారు.

కొత్తగా షెడ్ నిర్మాణం..

కొన్ని రోజుల తరువాత పెద్ద షెడ్ వేయడం ప్రారంభించారు. ఏపీ కార్స్ పేరుతో సెకండ్ హ్యాండ్ కారులు క్రయ, విక్రయాలు జరిపే వారికి అద్దెకు ఇచ్చారు. ఈ విషయంపై ముస్లిం సంఘాలు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రాలు అందజేశారు. అంజుమన్–ఎ–ఇస్లామియా సంస్థ మొదటి నుంచి కమిటీ అధ్యక్ష, సభ్యులు విషయాల్లో తూర్పు నియోజక వర్గానికి చెందిన వారే ఆధిపత్యం వ్యవహరిస్తుంటారని చెబుతున్నారు.

అంజుమన్ సంస్థ వక్ఫ్ ఆధీనంలో ఉందా..?

నగరంలో ప్రధానంగా అంజుమన్–ఎ–ఇస్లామియా సంస్థ వక్ఫ్ బోర్డు ఆధీనంలో పని చేయాల్సి ఉంది. ఈ సంస్థకు ఒక కమిటీ, దానికి అధ్యక్షుడు ఉంటారు. ఈ కమిటీకి ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఉన్నారు. కమిటీ బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఈద్గా స్థలంలో షెడ్ నిర్మాణం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ షెడ్‌కు సంబంధించి జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ దానికి అద్దె కేటాయింపు గురించి పూర్తిగా తెలియనివ్వకుండా పై స్థాయిలో మాట్లాడుకుని షెడ్ నిర్మాణం చేసినట్లు సమాచారం. మరో వైపు 30 రోజుల తరువాత రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. పండుగ సమయంలో నైనా నగర వాసులకు ఈద్గాలో నమాజ్ చేసుకునేందుకు వీలు ఉంటుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నా దృష్టికి రాలేదు

అంజుమన్ కమిటీ సభ్యులు ఎవరూ నా దృష్టికి తీసుకురాలేదు. వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులకు ఏమైన తెలియజేశారేమో తెలియదు. ఈద్గా స్థలంలో నిర్మాణం చేస్తున్న షెడ్ గురించి విచారించి అక్రమంగా నిర్మాణం చేస్తున్నట్లు అయితే తక్షణమే తగిన చర్యలు తీసుకుంటాం.

–ముక్తార్ బాషా, గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

డాక్టర్ రంగిశెట్టికి తెలుగువెలుగు సాహితీ పురస్కారం



తెనాలి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)కి తెలుగు వెలుగు సాహితీ సేవా పురస్కారం స్వీకరించారు. ప్రస్తుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, తెలుగు వెలుగు సంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతులమీదుగా సత్కారం జరిగింది. ఇదే వేదికపై రమేష్ రచించిన ‘గంగాహారతులు’, ‘శస్త్రాలు’ పుస్తకాలను మండల బుద్ధప్రసాద్, కత్తి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను పలువురు రచయితలు, కవులు అభినందించారు.

సూపర్ సిక్స్ హామీలు తక్షణమే నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

తెనాలి: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం తీర్మానించింది. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఏర్పాటైన తొలి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడారు. సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలతో అంబటి రాంబాబు తీర్మానాలను ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేశామని చెబుతున్న ఏడాదికి మూడు సిలెండర్ల పథకంలో కేవలం ఒక సిలెండరు మాత్రమే ఇచ్చారని, ఆర్థికసంవత్సరం లోగా మిగిలిన రెండు సిలిండర్లను ఇవ్వాలని కోరుతూ మరో తీర్మానం చేశారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో కార్యవర్గ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. పార్టీ నూతన కార్యవర్గంలో నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, లీగల్ సెల్, రైతు కమిటీ, ఎస్సీ సెల్ వంటి అనుబంధాల సంఘాల నేతలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

తెనాలి: అంగలకుదురులోని శ్రీకోదండ రామసేవక ధర్మసమాజం (దాసకుటి)లో శ్రీఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసస్వామి 163వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలిరోజున శ్రీవాసుదాసస్వామి పాదుకలకు అభిషేకం, పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోరోజైన సోమవారం శ్రీభూదేవి శ్రీదేవిసమేత శ్రీనివాసస్వామి కళ్యాణం, సీతారామకళ్యాణం, శ్రీమహాలక్ష్మి అమ్మవారి సామూహిక కుంకుమ పూజను ఘనంగా జరిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పోస్టల్ కార్మికుల కోసం పోరాడిన డీఎస్ఎన్



తెనాలి: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమనేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (డీఎస్ఎన్) చిరస్మణీయుడని ఫ్రెండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.పోలేశ్వరరావు అన్నారు. ఇటీవల హఠాన్మరణం చెందిన పోస్టల్ ఉద్యోగుల నేత డీఎస్ఎన్ సంతాప సభను సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని అసోసియేషన ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన పోలేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం వేలాదిమందిని సమీకరించి ఢిల్లీలో పోరాటం చేసిన డీఎస్ఎన్, వారికి కొన్ని హక్కులను సాధించగలిగారని సోదాహరణంగా చెప్పారు. అంతేకాకుండా క్రెడిట్ సొసైటీతో పోస్టల్ ఉద్యోగులకు ఎంతగానో మేలుచేశారని తెలిపారు. సీపీఎం నేత ములకా శివసాంబిరెడ్డి, రైతు సంఘం సభ్యురాలు శివకుమార్, ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్‌కు చెందిన యు.సత్యనారాయణ, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి వీవీ సుబ్బారావు, ఎస్.నరసింగరావు, వై.రమేష్‌బాబు, ఎ.సత్యనారాయణ, అంబటి సీతారామయ్య మాట్లాడారు. తొలుత డీఎస్ఎన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

కుమార్ పంప్స్‌లో రక్తదాన శిబిరం

తెనాలి: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద యూనిట్లకుపైగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి పాల్గొన్నారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర జన్మదినాన ఏటా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు.